ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.6, కనిష్ఠం 16.8



కామారెడ్డి జిల్లా వార్తలు

5

గురువారం 4 జనవరి 2024

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

బిచ్కుంద, జనవరి 3: మండలంలోని పెద్దదేవాడ గ్రామంలో బాల్య వివాహం జరుగుతుందన్న సమాచారంతో తహసీల్దార్ లక్ష్మణ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కొమురమ్మ అడ్డుకున్నారు. పెద్దదేవాడ గ్రామానికి చెందిన అబ్బాయితో పిట్లం మండలంలోని చిల్లరి గ్రామానికి చెందిన బాలికతో వివాహం చేస్తున్నారనే సమాచారం రావడంతో ఇరు కుటుంబాలకు కౌన్సెలింగ్ నిర్వహించి బాలిక మేజర్ అయిన తర్వాతనే వివాహం చేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సదానందప్ప, స్వచ్ఛంద సంస్థ అధికారిణి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై.. విచారణ!



కామారెడ్డిలో రోడ్డు కొలతలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)



కొలతలను చేపడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు (ఫైల్)

- కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో అవినీతి, అక్రమాలపై మళ్లీ విజిలెన్స్ దృష్టి
- గత మూడు పాలకవర్గాల్లో జరిగిన పనులపై ఆరా
- శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ శాఖల్లో అవినీతి ఆరోపణలు
- రెండేళ్ల కిందట అప్పటి బీజేపీ నాయకుడు, ప్రస్తుత ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఫిర్యాదు
- నత్తనడకన కొనసాగిన విచారణ.. ప్రభుత్వం మారడంతో మళ్లీ విచారణ షురూ
- నేడు, రేపు విచారణకు రావాలని ఆయా శాఖల అధికారులకు విజిలెన్స్ నోటీసులు
- అవినీతి అధికారులు, కాంట్రాక్టర్ల గుండెల్లో గుబులు

కామారెడ్డి టౌన్, జనవరి 3: కామారెడ్డి మున్సిపల్‌లో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని గత మూడు పాలకవర్గాల కాలంలో పనులు చేయకముందే బిల్లులు లేపారంటూ గత రెండు సంవత్సరాల కిందట విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పటి బీజేపీ నాయకుడు, ప్రస్తుత ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఫిర్యాదు చేసిన విషయం విధితమే. ఆయన ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ అధికారులు ఆయా విభాగాలకు సంబంధించిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించడమే కాకుండా అధికారులను సైతం విచారించి వారు ఇచ్చిన రికార్డులను, స్టేట్‌మెంట్‌ను తీసుకెళ్లారు. అయితే విచారణను త్వరగా పూర్తి చేయకుండా సాగదీస్తూ వచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో పాటు ఆయా శాఖల అధికారులు మారడంతో మళ్లీ కామారెడ్డి మున్సిపల్‌లో అవినీతి, అక్రమాలపై విచారణను పునఃప్రారంభించేందుకు కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే మున్సిపల్‌లోని ఆయా విభాగాలకు చెందిన అధికారులకు విచారణకు మరోమారు హాజరు కావాలని విజిలెన్స్ నుంచి నోటీసులు అందించారు. దీంతో నేడు, రేపు రెండేసి విభాగాల చొప్పున అధికారులు విచారణకు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీలోని పలు విభాగాల్లో అక్రమ నియామకాలు, పనుల విషయంలో నాణ్యత లేకుండా ఇష్టానుసారంగా బిల్లులు పెట్టుకోవడం, అక్రమ నిర్మాణాలకు కొందరు అధికారులు సిబ్బందితో పాటు పాలకవర్గ సభ్యుల ప్రోత్సాహం ఉందంటూ విమర్శలు రావడం ఫిర్యాదులు వెళ్లడంతో అప్పట్లో నిఘా వర్గాలు సైతం దృష్టి సారించాయి. అయితే ఈ విచారణ సదుమణిగింది అనుకుంటున్న సమయంలో మరోమారు విజిలెన్స్ అధికారులు ఆరా తీయడంతో కామారెడ్డి మున్సిపాలిటీలోని అవినీతి అధికారులు, సిబ్బందితో పాటు పలువురు కాంట్రాక్టర్లలో ఆందోళన నెలకొంటుంది. ఈ సారైన అవినీతి అక్రమాలను నిగ్గు తెలుస్తారా.. నీరు గారుస్తారా తేలాల్సి ఉంది.

రెగ్యులర్ సిబ్బంది కంటే.. ఔట్ సోర్సింగ్ సిబ్బందే ఎక్కువ

మున్సిపాలిటీలో రెగ్యులర్ ఉద్యోగుల కంటే ఔట్ సోర్సింగ్ సిబ్బంది సంఖ్యే ఎక్కువగా ఉన్నప్పటికీ అందుకు సంబంధించిన నియామక ప్రక్రియలో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం మున్సిపల్‌లో పని చేస్తున్న కొందరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస అర్హతలు లేకున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించిన వారికి ఉద్యోగాలు ఇవ్వడం, ఎలాంటి నోటిఫికేషన్‌లు లేకుండానే ముడుపులు తీసుకుంటూ అక్రమ నియామకాలు చేపట్టడం వారు మున్సిపల్ పనుల కంటే సదరు ప్రజాప్రతినిధుల పనులపైన, అధికారులు చెప్పిన పనులను మాత్రమే చేస్తూ పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారని అప్పట్లో బీజేపీ కౌన్సిలర్‌లు, నాయకులు ఫిర్యాదులు చేశారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగంలో ఫీల్డ్ వర్క్ మీద పనిచేసే కొందరు కాంట్రాక్టర్‌లు తమకు అనుకూలంగా ఉన్న సిబ్బందిని నియమింపజేసుకుని వారు చేసే పనులపై తూతూ మంత్రంగా పర్యవేక్షణ చేసేలా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఈ నియామకాలపైనే ఎక్కువ మొత్తంలో ఆధారాలతో ఫిర్యాదు చేశారు. దీంతో విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో ఫిర్యాదుల ఆధారంగా విచారణ చేపట్టగా చాలా చోట్ల నిబంధనలు అతిక్రమించారని గుర్తించారు. క్షేత్రస్థాయిలోనే ఆ పనులు చూసిన ఔట్ సోర్సింగ్ సిబ్బందిని, అధికారులను నిలదీసిన సంఘటనలు చోటు చేసుకున్నాయి.

ఇంజనీరింగ్ విభాగంలో ఇప్పటికీ మారని తీరు

మున్సిపాలిటీలోని పలు విభాగాల పనితీరులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఐదుగురు సభ్యులతో కూడిన ఓ బృందం రెండేళ్ల కిందట తనిఖీలు చేపట్టారు. ఆయా విభాగాలను పరిశీలించి ఆయా విభాగాధిపతులతో, సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఇంజనీరింగ్ విభాగంలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేశారు. ఇంజనీరింగ్ విభాగంలోని పలు రికార్డులను పరిశీలించారు. గత మూడు పాలకవర్గాల సమయంలో చేపట్టిన పనులపై, టెండర్లపై ఆరా తీశారు. పనులు చేపట్టకుండానే చేపట్టినట్లు బిల్లులు స్వాహ చేసినట్లు, చేపట్టిన పనులపైనే తూతూ మంత్రంగా పనులు చేపట్టి పూర్తిస్థాయిలో బిల్లులు పొందినట్లు, పనుల్లోనూ నాణ్యత ప్రమాణాలు పాటించలేదనే దానిపై ఆయా రికార్డులను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. విజిలెన్స్ విచారణ జరిగిన ఇంజనీరింగ్ అధికారుల, సిబ్బంది పనితీరు మాత్రం మారలేదు. ఇప్పటికే అదే నిర్లక్ష్యంను చూపుతుండడం గమనార్హం. సంవత్సరకాలంగా పట్టణంలో ఆయా వార్డులలో చేపట్టిన పనులలో నాణ్యత లోపం కొట్టిచినట్లు కనిపిస్తోంది. పట్టణంలోని మూడో వార్డులో ప్రధాన రహదారికి ఇరువైపుల మురికి కాలువల నిర్మాణం చేపట్టారు. ఆ కాలువలు నిర్మాణం చేపడుతున్న సమయంలోనే కూలిపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేసి ఇవేమి పనులు అని ప్రశ్నించిన సంఘటనలు ఉన్నాయి. సంవత్సరాల తరబడి మన్నికగా ఉండాల్సిన మురికి కాలువ మూన్నాళ్లకే శిథిలావస్థకు చేరుకుంది. 20 ఏళ్ల కింద కట్టిన మురికికాలువను తీసివేసి ప్రస్తుతం ఎలాంటి ఇసుక వాడకుండా డస్ట్‌తోనే మురికికాలువ నిర్మాణం చేపట్టారు. నాణ్యత లోపించడంతో ఇటీవల ఆ ప్రాంతంలోని ఓ మహిళ ఆ మురికి కాలువకు ఇరువైపుల నిర్మించిన సరిహద్దు గోడలపై కాలు పెట్టడంతో అదికాస్త కూలిపోయి ఆమె మురికి కాలువలో పడిపోయి తీవ్రగాయాలపాలైంది. ఇలా అనేక వార్డులలో ఇదే పరిస్థితి నెలకొంటుంది. అసలు ఏ పనులలో ఇసుక అనేది వినియోగించిన ఆనవాళ్లు కనపడడం లేదు. మామూళ్లకు అలవాటు పడ్డ కొందరు సిబ్బంది కాంట్రాక్టర్‌లు చేసిన పనులను తూతూ మంత్రంగానే పర్యవేక్షిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టౌన్ ప్లానింగ్ విభాగంపై సైతం విచారణ

కామారెడ్డి జిల్లా కేంద్రంగా ఏర్పడడం, రోజురోజుకూ పట్టణం విస్తరిస్తుండడంతో కొత్త కాలనీలు వెలుస్తున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లోనూ అపార్ట్‌మెంట్ల కల్చర్, షాపింగ్ కాంప్లెక్స్ లాంటి భవన నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే ఈ భవన నిర్మాణాల్లో అవకతవకలు అక్రమాలు చాలానే ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. అక్రమ నిర్మాణాలకు కొందరు పాలకవర్గ సభ్యులే కాకుండా మున్సిపల్‌లోని కొందరు అధికారులు సహకరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. రోడ్ల వెడల్పులోను స్థానికంగా ఉండే కౌన్సిలర్‌లు తమ పలుకుబడి ఉపయోగించి ఆ పనులు కాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్ కార్యాలయం నుంచి రోడ్డు వెడల్పు కోసం ప్రధానమురికికాలువ తవ్వకాలు చేపట్టారు. డీఎస్పీ కార్యాలయంకు సంబంధించి ఓ గది వెడల్పులో పోగా నిజాంసాగర్ చౌరస్తాలో కొన్ని షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మాత్రం వేటిని కూలగొట్టకుండా మురికికాలువనే మళ్లించడం ఆ పనులను ఆపివేయడంతో అప్పటి బీజేపీ నాయకుడు, ప్రస్తుత ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఆ ప్రాంతంలో ఆపివేసిన పనులను సైతం పరిశీలించి అధికారుల తీరుపై నిలదీశారు. ఇలా రోడ్డు వెడల్పులోనే కాకుండా బహుళ అంతస్తుల నిర్మాణాల అనుమతుల్లోనూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు చేపడుతుండడంతో మున్సిపల్‌కు రావాల్సిన ఆదాయం కోల్పోవాల్సి వస్తుందని విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు చేయడంతో ఆ విభాగంపై సైతం విచారణ చేపట్టారు. అధికారులను విచారించి వారు ఇచ్చిన స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. వీటితో పాటు సానిటేషన్, రెవెన్యూ విభాగాలపై విచారణ జరిపి ఆయా అధికారులు, సిబ్బంది స్టేట్‌మెంట్‌లను రికార్డు చేసుకున్నారు. అయితే ప్రస్తుతం మళ్లీ విజిలెన్స్ విచారణపై కదలిక రావడంతో అధికారులు, సిబ్బందిలో ఒకింత గుబులు కనిపిస్తోంది. ఎవరి ఉద్యోగాలకు ఎసరు వస్తుందోననే ఆలోచనలో పడుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగంలో జరిగిన అవినీతి, అక్రమాలు, నాణ్యత లేని పనులపై మళ్లీ విచారణ జరిగితే తమ పరిస్థితి ఏంటనే చర్చలు ఆయా అధికారులు, సిబ్బంది, పలువురు కాంట్రాక్టర్ల మధ్య నెలకొనడం గమనార్హం.

గంజాయి నిర్మూలనపై ఫోకస్

- జిల్లాలో విస్తృతంగా తనిఖీలు
- గుట్టుచప్పుడు కాకుండా మహారాష్ట్ర నుంచి రైలులో తరలింపు
- పోలీసుల తనిఖీల్లో వెలుగు చూస్తున్న గంజాయి సరఫరా
- మైనర్లను మత్తులో ముంచుతున్న గంజాయి స్మగ్లర్లు
- గ్రామాలకు పాకిన గంజాయి స్మోకింగ్
- మత్తులో దౌర్జన్యాలు, ప్రమాదాలకు కారణమవుతున్న మైనర్లు
- కామారెడ్డి మున్సిపల్ సమావేశంలో సైతం ఇటీవల ఎమ్మెల్యే చర్చ



గాంధారిలో గడ్డివాములో గంజాయి కోసం వెతుకుతున్న పోలీసులు

కామారెడ్డి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి వాసన లేకుండా చేసేందుకు పోలీసులు ఫోకస్ చేశారు. జిల్లాలో గంజాయి సరఫరాపై ఆయా పోలీసు స్టేషన్‌ల పరిధిలో గట్టి నిఘాను ఏర్పాటు చేయాలని ఎస్పీ సింధూశర్మ ఆదేశించడంతో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రం, మండలంతో పాటు ఆయా మండలాల్లో పెద్ద ఎత్తున గంజాయి సరఫరాదారులు, గంజాయి తాగే వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుందనే విమర్శలు వ్యక్తం అవుతుండడంతో పోలీసులు ఏ చిన్న సమాచారం వచ్చినా తనిఖీలు చేపడుతున్నారు. ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకుని జైలుకు సైతం తరలించారు. అయితే ఈ విషయంపై ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి సైతం కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్‌లకు సైతం గంజాయిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తమ పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సూచించారు.

మైనర్లను మత్తులో ముంచుతున్న గంజాయి స్మగ్లర్లు

ఒక్కప్పుడు వ్యవసా...

మూల గ్రామాలు తండాల్లో నేరుగా గంజాయిని సాగు చేసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తూ దందాను జోరుగా సాగించేవారు. ప్రస్తుతం గంజాయి స్మగ్లర్లు కొత్తదారులు ఎంచుకుని ఇతర రాష్ట్రాల నుంచి ఎండు గంజాయిని తెప్పించి జిల్లా జాతీయ రహదారుల మీదుగా జిల్లాకు సరిహద్దులుగా ఉన్న మండలాలకు తరలించి అక్కడి నుంచి జిల్లాలోని ఆయా మండలాలకు గుట్టుగా సరఫరా చేస్తున్నారని తెలుస్తోంది. ఇటీవల కాలంలో రైల్వే మార్గంలో గంజాయి తీసుకు వచ్చే పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మైనర్లను టార్గెట్ చేసుకుని సరఫరా చేయించడం, వారిని మత్తులో దించడం చేస్తున్నారు. గత ఏడాది కిందటి వరకు పట్టణ ప్రాంతాల్లో కనిపించిన గంజాయి స్మోకింగ్ కల్చర్ ఇప్పుడు గ్రామాల్లో కనిపిస్తుండడంతో గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కామారెడ్డి మండలంలోని ఆయా గ్రామాల శివారు ప్రాంతాలతో పాటు కామారెడ్డి పట్టణంలోని ఆయా వార్డుల శివారు ప్రాంతాల్లోకి గంజాయిని తీసుకువచ్చి మైనర్‌లకు అందిస్తున్నట్లు ఆయా ప్రాంతాల ప్రజలు పేర్కొం టున్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

గంజాయి స్మగ్లింగ్, స్మోకింగ్, మైనర్లకు అలవాటు చేస్తూ వారి జీవితాలతో ఆడుకుంటున్నారనే సమాచారంతో పాటు ప్రభుత్వం సైతం గంజాయి, డ్రగ్స్‌ను ఉక్కుపాదంతో అణిచి వేయాలని సూచించడంతో పోలీసులు గంజాయి ఆనవాళ్లు లేకుండా చేసేందుకు చర్యలు చేపట్టారు. మత్తును ఇచ్చే పానీయాల తయారీపై సైతం దృష్టి సారించారు. బుధవారం జిల్లాలోని గాంధారి మండలం మూడు తండాల్లో పెద్దఎత్తున తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా పంట పొలాల్లో తనిఖీలు చేపట్టి అంతర పంటగా ఎవరైన గంజాయి సాగు చేస్తున్నారనే దానిపై ఆరా తీశారు. గంజాయిని సప్లయ్ చేస్తున్నట్లు గాని, స్మోకింగ్ చేస్తున్నట్లు గాని ప్రజలు తమ దృష్టికి వస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

నీటితో కళకళలాడుతున్న పోచారం ప్రాజెక్టు



యాసంగి సాగు కోసం నేడు పోచారం ప్రాజెక్టు నీటి విడుదల

నాగిరెడ్డిపేట, జనవరి 3: యాసంగి పంటల సాగు కోసం పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా గురువారం మధ్యాహ్నం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు నీటిని విడుదల చేయనున్నట్లు ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం యాసంగిలో ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని ఎల్లారెడ్డి మండలానికి చెందిన బీ జోన్ ఆయకట్టు సాగు భూములకు నీరందించేందుకు ప్రాజెక్టు నీటిని విడుదల చేస్తున్నారు. పోచారం ప్రాజెక్టు ప్రస్తుతం నిండుకుండలా ఉంటూ నీటితో కళకళలాడుతోంది. ప్రస్తుత యాసంగి పంట సాగుకు ఎలాంటి నీటి ఇబ్బంది లేకుండా ప్రాజెక్టులు పుష్కలంగా నీరు నిలువ ఉంది. పోచారం ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 1464 అడుగులు (1.820 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 1460.71 అడుగులు (1.317 టీఎంసీలు)ల నీరు నిలువ ఉన్నట్లు డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రస్తుత 2023-24 యాసంగి సీజన్‌లో ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని ఎల్లారెడ్డి మండలం బీ జోన్ రైతులకు సాగు నీరు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. బీ జోన్‌కు చెందిన 45 డిస్ట్రిబ్యూటరీ నుంచి, 73 డిస్ట్రిబ్యూటరీ వరకు 3,806 ఎకరాల సాగు భూములకు సాగు నీరు అందించనున్నట్లు ఆయన తెలిపారు. నీటి విడుదల కార్యక్రమానికి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొనాలని ఆయన కోరారు.

అప్పుల్లో క్రీడా నిర్వాహకులు



- గత ఏడు సంవత్సరాల నుంచి డబ్బులు చెల్లించని ప్రభుత్వం
- అప్పుచేసి రాష్ట్రస్థాయి క్రీడల నిర్వహణ
- ఎవరికీ చెప్పుకోలేక ఇబ్బంది పడుతున్న వైనం
- ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రెటరీలు, క్రీడా నిర్వాహకులు

సుభాష్‌నగర్, జనవరి 3: ప్రతీ సంవత్సరం క్రీడాకారుల ఎంపికలు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల కోసం ప్రభుత్వాలు కొంత మొత్తంలో డబ్బులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. మొదటగా క్రీడా నిర్వహణ కోసం క్రీడా నిర్వాహకులు, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీలు తమ సొంత డబ్బులు వెచ్చించి క్రీడలను నిర్వహిస్తారు. బిల్లులు ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అధికారులకు చెల్లించిన అనంతరం రాష్ట్రస్థాయిలో బిల్లులు విడుదల చేయాలి. కానీ అలా జరగడం లేదు. గత ఏడు సంవత్సరాలుగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడలకు ఒక్క వాటికి కూడా బిల్లులు చెల్లించలేదు. రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహించిన ఎస్‌జీఎఫ్ సెక్రెటరీలు అప్పులు చేసి క్రీడలను నిర్వహించారు. దీంతో పాటు క్రీడా సంఘాలకు సైతం అప్పులు చేసి క్రీడలను నిర్వహించింది. గతంలో ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం బిల్లులు చెల్లిస్తుండగా గత ఏడేళ్లుగా బిల్లులు చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీలు ఇబ్బందులకు గురవుతున్నారు. అప్పులు చేసి క్రీడలు నిర్వహించి అప్పులు చెల్లించలేక వడ్డీలు కడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎస్‌జీఎఫ్ కాల పరిమితి రెండు సంవత్సరాల సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఏడు సంవత్సరాలపైగా బిల్లులు రాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా 10 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. గత ప్రభుత్వం బిల్లులు విడుదల చేసినట్లు ప్రకటించిన వీరికి మాత్రం చెల్లించలేదు. నిజామాబాద్ జిల్లా గత ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సుమారు 8లక్షల అప్పుచేసి రాష్ట్రస్థాయి క్రీడలను నిర్వహించాడు. క్రీడలు నిర్వహించి ఐదు సంవత్సరాలు అవుతున్నా ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. దీనికి తోడు మొదటగా మామూలు బిల్లులు ఇవ్వగా జీఎస్టీ బిల్లు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయడంతో జీఎస్టీ బిల్లును కూడా ఇచ్చారు. అయినా ఇప్పటికీ బిల్లులు మంజూరు కాలేదు. అంతేకాకుండా క్రీడా సంఘాల ప్రతినిధులు సైతం రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను నిర్వహించారు. వీరికి కూడా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నుంచి డబ్బులు రావాలి. వీరికి కూడా ఇప్పటి వరకు డబ్బులు అందజేయలేదు. వీరి బకాయిలు కూడా లక్షల్లో ఉన్నట్లు తెలిసింది. క్రీడల నిర్వహణ ఎస్‌జీఎఫ్ సెక్రెటరీలకు భారంగా మారింది. నూతన ప్రభుత్వమైనా క్రీడల నిర్వహణపై శ్రద్ధ చూపాలని క్రీడా అభిమానులు, వ్యాయామ ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఇప్పటికైనా క్రీడల కోసం వెచ్చించిన డబ్బులను ఇవ్వాలని తమను అప్పుల బారినుంచి కాపాడాలని కోరుతున్నారు.

ప్రభుత్వం అందించే దరఖాస్తులనే ఉపయోగించాలి

తాడ్వాయి, జనవరి 3: ప్రభుత్వం ఉచితంగా అందించే దరఖాస్తులనే ఉపయోగించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లిలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగానే దరఖాస్తులను అందిస్తుందని తెలిపారు. ఎవరైన జిరాక్స్ సెంటర్లలో తీసుకువచ్చిన దరఖాస్తులను తీసుకోవద్దని అధికారులకు సూచించారు. జిరాక్స్ సెంటర్లలో దరఖాస్తులను విక్రయిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనవసరంగా పేద ప్రజలను మోసం చేయవద్దని తెలిపారు. ప్రతీ కుటుంబానికి అవసరమైనన్ని దరఖాస్తులను ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేసిందని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌వీర్ తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్





తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత దంపతులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 3: తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామిని బుధవారం మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత దంపతులు దర్శించుకున్నారు. బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వారితో పాటు శాసనమండలి మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్ దంపతులు, గడిల శ్రీరాములు దంపతులు, ఆకుల సురేందర్ దంపతులు శ్రీవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

← శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత దంపతులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ అర్బన్, జనవరి 3: రాష్ట్రంలో మళ్లీ కరోనా కొత్త వేరియంట్ కేసులు నమోదవుతున్న దృష్ట్యా నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. ప్రజలు బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా మాస్కులు ధరించాలన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే ఆసుపత్రికి వెళ్లి టెస్టులు చేయించుకోవాలని సూచించారు. చలి తీవ్రత నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

తపస్వీ తేజోనిలయంలో అన్నదానం

ఆర్మూర్‌రూరల్, జనవరి 3: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో తపస్వీ తేజోనిలయంలో బుధవారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపస్వీ తేజోనిలయం విద్యార్థులకు తనవంతు సేవలను ఎల్లవేళల అందిస్తానని, అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు పట్వారీగోపి కృష్ణ, కార్యదర్శి పట్వారితులసీ, శశిధర్, తేజోనిలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్ ఆర్టీసీ డిపోమేనేజర్‌గా ఆంజనేయులు

పెర్కిట్, జనవరి 3: ఆర్మూర్ పట్టణ ఆర్టీసీ డిపో నూతన డిపో మేనేజర్‌గా బి.ఆంజనేయులు బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లోని కాచిగూడ ఆర్టీసీ డిపో నుంచి ఆంజనేయులు బదిలీపై ఆర్మూర్ డిపోకు వచ్చారు. గత డిపో మేనేజర్ టి.శ్రీనివాస్ డిసెంబర్ 31న ఉద్యోగ విరమణ పొందారు.



ప్రజా పాలనలో దరఖాస్తులను స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

సంక్షేమ ఫలాలు ప్రతీ లబ్ధిదారునికి అందాలి

బోధన్ రూరల్, జనవరి 3: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనలో భాగంగా ప్రతి దరఖాస్తును అధికారులు స్వీకరించాలని, అర్హులైన ప్రతీ లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందాలని బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని 27, 29వ వార్డులలోని సభలను ఆమె పర్యవేక్షించారు. ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఇప్పటి వరకు కౌంటర్ల ద్వారా తీసుకున్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి లబ్ధిదారుడు దరఖాస్తుతో ఆధార్, రేషన్ కార్డును జతచేసి వెంటనే రసీదు తీసుకోవాలన్నారు. అధికారులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. దరఖాస్తుల ఫారాల కోసం ప్రజలు ఇబ్బందులు పడవద్దని, ప్రభుత్వమే ఉచితంగా దరఖాస్తు ఫారాలను అందజేస్తుందన్నారు. ఎవరైనా దరఖాస్తు ఫారాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డీఈ శివానందం, నరేందర్, కౌన్సిలర్లు అబ్దుల్లా, శ్రీకాంత్‌గౌడ్, శరత్‌రెడ్డి, వార్డు ప్రజలు తదితరులు ఉన్నారు.

నేడు ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

ఆర్మూర్‌టౌన్, జనవరి 3: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై గురువారం అవిశ్వాస పరీక్ష పెట్టనున్నారు. దీంతో మున్సిపల్ కార్యాలయంలో సమావేశానికి అన్ని ఏర్పాట్లను చేశారు. అవిశ్వాసానికి వ్యతిరేకించిన పలువురు కౌన్సిలర్‌లు రాష్ట్ర సరిహద్దుల్లో క్యాంపులలో ఉన్నారు. అవిశ్వాసానికి మద్దతు తెలుపుతున్న పలువురు కౌన్సిలర్‌లు జిల్లా కేంద్రంలో ఉన్నట్టు తెలిసింది. ఇదీలా ఉండగా అవిశ్వాస పరీక్షకు 2/3సభ్యులు హాజరుకావాల్సి ఉంది. ప్రస్తుతం అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చిన 24మంది కౌన్సిలర్‌లలో నలుగురు పండిత్ వినీతకు మద్దతుగా ఆమె నిర్వహించే క్యాంప్‌లోకి వెళ్లిపోయారు. దీంతో ఎంఐఎం, బీఆర్‌ఎస్ కలుపుకొని 20మంది కౌన్సిలర్‌లు ఉండగా బీజేపీ కౌన్సిలర్‌ల మద్దతు కచ్చితమైంది. వీరు అవిశ్వాస పరీక్ష నెగ్గాలన్నా, వీగాలన్నా వారి మద్దతు కోసం మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత భర్త పవన్, అలాగే మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వాతిసింగ్ భర్త బబ్లు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

నందిపేట, జనవరి 3: మండల కేంద్రంలోని రాజానగర్ దుబ్బా ప్రాంతంలో బుధవారం అయోధ్య రాముడి అక్షింతలను బీజేపీ నాయకులు ఇంటింటికీ పంపిణీ చేశారు. అలాగే అక్షింతలతో పాటు నూతనంగా ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో నిర్మించిన రామ మందిరం ఫొటోలను వితరణ చేశారు. గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో అక్షింతలు రామ మందిరం ఫొటోలను పూజించారు. వాటిని తీసుకువెళ్లి పూజ గదిలో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆరుట్ల రమేష్, ఏర్రం లింగం, కరెంట్ సంతోష్ తదితరులు ఉన్నారు.


ముగిసిన మల్లన్న స్వామి ఉత్సవాలు

కమ్మర్‌పల్లి, జనవరి 3: మండలంలోని బషీరాబాద్ గ్రామ శివారులోని దూలగుట్టపై కొలువుదీరిన గ్రామయాదవుల ఆరాధ్యదైవం మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు ముగిసినట్లు యాదవ సంఘ సభ్యులు తెలిపారు. బుధవారం సాయత్రం గుట్టపైగల మల్లన్న స్వామి ఆలయ వద్ద అగ్నిగుండం ఏర్పాటు చేయగా భక్తులు యాదవసంఘ సభ్యలు అగ్నిగుండ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఒగ్గు కళాకారుల బృందం సభ్యులు మల్లన్న స్వామి జీవిత చరిత్రను వినిపించారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన స్వామివారి జాతరా ఉత్సవాలు ప్రత్యేక పూజలకు హజరై స్వామివారికి కట్నకానుకలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడు ముత్తన్న, కార్యదర్శి రాజు, సభ్యులు బక్కన్న, నారాయణ, ప్రశాంత్ నడప్పన్న, భైకాని మహేష్, అబ్బాస్, సామెర సుమన్, గ్రామ యాదవ కుల సంఘం సభ్యులు, మహిళలు, గ్రామస్థులు, మల్లన్న దీక్షాపరులు పాల్గొన్నారు.


















నాడాపూర్‌లో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు

నవీపేట, జనవరి 3: మండలంలోని నాళేశ్వర్, తుంగిని, నాడాపూర్, జన్నేపల్లి, మిట్టాపూర్, మట్టయ్య ఫారంలలో బుధవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ప్రజలు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు వాటిని స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధన్‌వాల్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● గుండారంలో గ్రామసభ

నిజామాబాద్‌రూరల్, జనవరి3: రూరల్ మండలం గుండారం గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తులపై గ్రామసభ నిర్వహించారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లక్ష్మణ్‌రావు, ఉపసర్పంచ్ శంకర్ రెడ్డి, ఎంపీటీసీ గంగాధర్, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఇప్పటివరకు 900 మంది పలు సేవల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు. అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకుని సరియైన ధృవీకరణ పత్రాలను సరిచూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేష్, డిప్యూటీ తహశీల్దార్ రంజిత్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హరీష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుదాకర్‌రెడ్డి ఉన్నారు.

● ప్రజా సమస్యల కోసమే ప్రజా పాలన

వర్ని: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమం చేపట్టిందని ఎంపీడీవో బషీరుద్దీన్ తెలిపారు. బుధవారం జలాల్‌పూర్, కూనిపూర్ గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో ఆయన మాట్లాడారు. ప్రజలు అందించే దరఖాస్తులను ఉన్నతాధికారులకు అందజేసి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసేలా కృషి చేస్తామని చెప్పారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిత వెంకట్ గౌడ్, సీహెచ్ గంగారాం, నరెడ్ల బాలు, హన్మాగౌడ్, నరెడ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు. చందూర్ మండల కేంద్రంలో ప్రజా పాలన దరఖాస్తు స్వీకరణను ప్రత్యేక అధికారి సింహాచలం తనిఖీ చేశారు.

షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులను ఆదుకోవాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

బోధన్ రూరల్, జనవరి3: ప్రభుత్వం నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించి ఆదుకోవాలని సీపీఐఎం జిల్లా కార్యదర్శి ఎ.రమేష్‌బాబు అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లోని కాకయ్య స్వామి మఠంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చినహామీ ప్రకారం నిజాంషుగర్స్ ఫ్యాక్టరీతో పాటు ఎడపల్లి మండలంలో ఉన్న షుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించాలని డిమాండ్ చేశారు. ఎనిమిది సంవత్సరాలుగా కార్మికులకు వేతన బకాయిలు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని లేఆఫ్ నుంచి తీసేసి ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో బోధన్ డివిజన్ కార్యదర్శి ఏశాల గంగాధర్, సీపీఎం పార్టీ జిల్లా నాయకులు గంగాధరప్ప, శంకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

దూపల్లిలో గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన

రెంజల్, జనవరి3: మండలంలోని దూపల్లి గ్రామంలో గ్రామదేవతల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం వేద పండితుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహలక్ష్మి, గజ్జెలమ్మ, పోత లింగయ్య విగ్రహలతో పాటు గ్రామంలో మొత్తం 25 విగ్రహలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిరెడ్డి, ఉపసర్పంచ్ సాయిలు, తదితరులున్నారు.



సావిత్రీబాయిపూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



బీజేపీ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న బస్వాలక్ష్మినారాయణ



ఇందల్వాయిలో..

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి

● జిల్లావ్యాప్తంగా ఆయా పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు

● నివాళులర్పించిన నాయకులు, అధికారులు

నిజామాబాద్ అర్బన్, జనవరి3: భారతదేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. పలు పార్టీలు, పలు సంఘాలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే విగ్రహానికి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వలక్ష్మినర్సయ్య, నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, బాలికల విద్య కోసం, సామాజిక దురాచారాలను రూపుమాపడం కోసం ఆమె కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వామియాదవ్, శివప్రసాద్, శ్రీనివాస్, కిశోర్, గిరిబాబు, ఎర్రంసుధీర్, తదితరులు పాల్గొన్నారు.

● ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..

నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడారు. తాను చదువుకొని సాటి స్త్రీలకు విద్య చెప్పేందుకు అనేక పోరాటాలు చేసి సావిత్రీబాయి పూలే విద్యను అందించారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అంజలి, పవన్, భరత్, అరవింద్, వినయ్ పాల్గొన్నారు.

● ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

సావిత్రీబాయి పూలే జయంతిని ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కోటగల్లి బాలికల జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వామి హాజరై మహిళల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప వ్యక్తి సావిత్రిబాయి పూలే కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నుస్రత్ జహాన్, ఎస్ఎఫ్ఐ జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు విఘ్నేష్, అనిల్, విశాల్, పాల్గొన్నారు.

● బీసీ సంఘం ఆధ్వర్యంలో...

సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని బీసీ సంక్షేమ సంఘం నాయకులు, మేరు సంఘం నాయకులు నగరంలోని అంబేద్కర్ కాలనీ వద్ద గల సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేరు సంఘం నాయకులు సోమ హన్మంత్‌రావు, గంగాకిషన్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు నరాల సుధాకర్ ఉన్నారు.

● మహిళలకు ఆదర్శం సావిత్రిబాయి

సుభాష్‌నగర్: మహిళల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయురాలు సావిత్రిబాయిపూలే అని నగర మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. బుధవారం నగరంలోని అంబేద్కర్ కాలనీలోగల సావిత్రీబాయి పూలేజయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఉమారాణి ముత్యాలు, నాయకులు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● సావిత్రీబాయి పూలే కృషితోనే స్త్రీలకు స్వేచ్ఛ

డిచ్‌పల్లి: మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం, విద్యా అందించిన మహనీయురాలు సావిత్రిబాయిపూలే అని ఎన్ఎస్‌యూఐ తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షుడు కొమిరే శ్రీశైలం అన్నారు. బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా టీయూఆర్ట్ అండ్ సైన్స్ కళాశాలలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సావిత్రబాయి పూలే చిత్రపటానికి మాజీ రిజిస్ట్రార్ ప్రొ.కనకయ్య పూలదండ వేసి నివాళ్లు అర్పించారు.

● మల్లారంలో..

నిజామాబాద్‌రూరల్: మండలంలోని మల్లారంలో సావిత్రీబాయి పూలే 193వ జయంతి ఘనంగా నిర్వహించారు. బుధవారం మల్లారంలోని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్‌లో జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నగేష్, రమేష్, నెహ్రూ, లక్ష్మణ్, శ్రవణ్ పాల్గొన్నారు.

● టీయూలో ఏబీవీపీ ఆధ్వర్యంలో..

డిచ్‌పల్లి: టీయూలో ఏబీవీపీ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఏబీవీపీ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు తోట సాయికృష్ణ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

● పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

పీడీఎస్‌యూ వర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో బాలికల హాస్టల్ ఎదుట సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిపూలేకు పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. అనంతరం టీయూ పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి జయంతి మాట్లాడారు. యూనివర్సిటీ సమస్యలపై సావిత్రి బాయి పూలే స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్సిటీ నాయకులు రవీందర్, హన్మండ్లు, ఆకాశ్, మోహిత్, పీరు సింగ్, పవిత్ర, ప్రతిజా పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే ఆధునిక భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలని తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.ఆరతి పేర్కొన్నారు. కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ప్రిన్సిపాల్ పూలదండవేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న తెలుగు విభాగంకళల పీఠాధిపతి ఆచార్యత్రివేణి మాట్లాడారు. పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషిచేసిన గొప్ప వీరవనిత అని అన్నారు. కార్యక్రమంలో ప్రొ.లావణ్య, ప్రొ.కనకయ్య, డా.పాతనాగరాజు, డా.సంపత్, ముషాఖురేషీ, భ్రమరాంబిక, స్రవంతి, దత్తహరి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

● బీసీ సంఘం ఆధ్వర్యంలో..

టీయూలో బీసీ విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహిళా అధ్యాపకులు, విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు, పాటాలపోటీలు, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానంచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొ.ఆరతి, ప్రొ.త్రివేణి, డైరెక్టర్ ఆఫ్ పీఆర్వో పున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండలంలోని ముషీర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యువజన సంఘాల నాయకుడు గురిజల హరీష్ మాట్లాడారు. ఇందులో పాఠశాల హెచ్ఎం వేణు ఉన్నారు. అలాగే కుల వివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రీబాయి పూలే జయంతిని వేడుకలో ఆ సంఘం మండల అధ్యక్షులు శంకర్ మాట్లాడారు.

ఇందల్వాయి: జనవరి 3ను జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని పీడీఎస్‌యూ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ డిమాండ్ చేశారు. ఇందల్వాయి మండల కేంద్రంలోని బాలికల ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో భారతదేశం మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. సావిత్రీబాయి పూలే ఆదర్శ విప్లవస్ఫూర్తి చదువుల తల్లి అని కొనియాడారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, తదితరులు ఉన్నారు.

● ఆర్మూర్‌లో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు, యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. పట్టణంలోనీ యూపీహెచ్‌సీ కేంద్రంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్ సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో స్వేరో నెట్‌వర్క్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సాయి, ఫిర్దోస్, శ్రీనివాస్, శేఖర్, తదితరులున్నారు.

● సీపీఎం ఆధ్వర్యంలో..

ఖిల్లా: మహిళలకు తగిన రక్షణ ఉన్నప్పుడే సావిత్రీబాయి పూలే ఆశయం నెరవేరుతుందని సీపీఐఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. బుధవారం నగరంలోని సీపీఐఎం పార్టీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే 193వ జయంతిని నిర్వహించారు.



టీయూలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న యువజన సంఘం నాయకులు

ఆవాస ప్రాంత పాఠశాల ప్రారంభం



విద్యార్థులను ఆవాసప్రాంత పాఠశాలలో చేర్పుతున్న అధికారులు

రామారెడ్డి, జనవరి 3: మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామంలో బుధవారం ఆవాస ప్రాంత పాఠశాలలను జిల్లా సెక్టోరియల్ అధికారి వేణుశర్మ, శ్రీపతిలు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వచ్చి కూలీ పనిచేస్తున్న తల్లిదండ్రుల అనుమతితో 16 మంది పిల్లలతో పాఠశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆనంద్‌రావు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, వాలీంటర్ వెంకటేష్, ఇటుకబట్టి యాజమాని గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు



హుండీ డబ్బులు లెక్కిస్తున్న దృశ్యం

మాచారెడ్డి,జనవరి3: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం హుండీని సహాయ కమిషనర్ ఎన్ సుప్రియ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. ఏడు హుండీలలో రూ.2,63,407 ఆదాయం వచ్చినట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఆలయ ఈవో శ్రీధర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్‌కుమార్, లక్ష్మన్,ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు

నవీపేట,జనవరి3: మండలంలోని మద్దెపల్లిలో బుధవారం అయోధ్యలోని శ్రీరామ మందిరానికి చెందిన అక్షింతలకు ఊరేగింపు నిర్వహించారు. స్థానిక హనుమాన్ మందిరం నుంచి గ్రామంలోని పలు వీధుల గుండా అక్షింతల కళశానికి ఊరేగింపు నిర్వహించారు.ఈ ఊరేగింపులో గ్రామంలోని మహిళలు హారతితో స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో రమేష్, సందీప్, తదితరులున్నారు.



మద్దెపల్లిలో అయోధ్య అక్షింతలకు ఊరేగింపు దృశ్యం

బీర్కూర్‌లో తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

బీర్కూర్, జనవరి 3: బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం కాలమానిని ప్రధానోపాధ్యాయుడు మోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశభక్తి, సంస్కృతి ప్రతిబింబించే విధంగా కాలమానిని రూపొందించామని అన్నారు. నూతన జాతీయ విద్య విధానం - 2020 అమలు, ఉపాధ్యాయ సమస్యలు, సీపీఎస్ విధానం రద్దు, డీఏ బకాయిలు, బదిలీలు, ప్రమోషన్లు, 317 బాధిత ఉపాధ్యాయులను వెంటనే స్థానిక జిల్లాలకు పంపించాలని, పండిత వ్యాయామ, ఉపాధ్యాయులకు ప్రమోషన్లు చేపట్టడం తదితర సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి రాష్ట్ర శాఖ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభన్ బాబు, హన్మాండ్లు, శ్రీనివాస్, గంగాధర్, చంద్రశేఖర్, సందీప్ కుమార్, శివలాల్, గాయత్రి, సరిత పాల్గొన్నారు.



బీర్కూర్‌లో తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లా అంతటా ఘనంగా సావిత్రీబాయిపూలే జయంతి



సావిత్రీబాయిపూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు

కామారెడ్డిటౌన్,జనవరి 3: కామారెడ్డి జిల్లా అంతటా సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గల విగ్రహానికి బీజేపీ తదితర సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనదేశంలో మొదటిమహిళా ఉపాధ్యాయురాలు,మహిళలకు చదువును అందించడానికి మొదటి పాఠశాలను స్థాపించిన సంఘసంస్కర్త అని అన్నారు.భర్త అడుగుజాడల్లో నడుస్తూ కులమతలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన పేమస్వరూపిణి అని విద్యతోనే స్త్రీకి విముక్తి సాధ్యపడుతుందని పూణేలో మొట్ట మొదటి పాఠశాల స్థాపించిందని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార,ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి: సావిత్రీబాయిపూలే జయంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ఆమె విగ్రహనికి ,ఘన్‌పూర్(ఎం) ప్రభుత్వ పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడుతూ సత్యశోధక్ సమాజ్ ఏర్పరిచి సమాజంలో జరుగుతున్న మూఢత్వాన్ని తేటతెల్లం చేశారని కొనియాడారు. సమాజంలో కుల,మత వర్గబేధాభిప్రాయాలు లేకుండా సమాజమంతా ఒకటేనని చాటి చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజురాణి, ఉపాధ్యాయ బృందం అంతయ్య, దేవిచంద్, కల్పన,కవిత,పొదర్లరవి, బాబు, జాన్, బాలచంద్రం, సంజీవ్,సత్యం,నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: తాడ్వాయి మండలంలో సావిత్రీబాయిపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.మండలంలోని ఎర్ర పహాడ్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఎన్ఆర్ఐ ప్రభోదన్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు కావాల్సిన ఫర్నీచర్‌కు సహాయం చేస్తామని తెలిపారు.ఈకార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు సంగారెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీ జలందర్‌రెడ్డిపాల్గొన్నారు.

బీబీపేట: బీబీపేటమండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయిపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూమహిళ విద్యాప్రాధాన్యతను పెంచిన మహోన్నత వ్యక్తి అని, కులమతాలకు అతీతంగా మహిళ విద్యను ప్రోత్సహించిన మొట్ట మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలోసభ్యులు తలారి ప్రభాకర్, నాగరాజు, చంద్రగౌడ్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డిటౌన్,జనవరి 3:కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ వద్దగల స్వప్నలోక్‌లో మున్సిపల్ స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసు కోవాలని కాలనీవాసులు కమిషనర్ దేవేందర్‌కు బుధవారం ఫిర్యాదుచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌పీఆర్ స్కూల్ సమీపంలో ఒక సంఘం నాయకులు ఎవరికి ఎలాంటి సమాచారం లేకుండా సంఘభవన నిర్మాణం కొరకు నిర్మాణ పనులు చేపడుతున్నారని అన్నారు.కాలనీ ఏర్పాటు సమయంలో మున్సిపల్‌కు స్థలం వదిలితే ఆ స్థలంలో గతంలో మున్సిపల్ కమీషనర్, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు సైతం మొక్కలు నాటారని తెలిపారు. ప్రస్తుతం ఆమొక్కలను తొలగించి దేవునిపల్లికి చెందిన కిసాన్ మున్నూరుకాపు సంఘం వారు సంఘ భవన నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు.ఏదైనానిర్మాణం చేపట్టదలుచుకుంటూ కాలనీవాసులకు అనుకూలంగా నిర్మాణాలు చేపట్టాలి కానీ ఈ విధంగా ఎక్కడి నుంచి ఇక్కడికి వచ్చి మున్సిపల్‌కోసం విడిచిన ఖాళీ స్థలంలో పనులు చేపట్టడం ఎంటని ప్రశ్నించారు.ఈ నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు ఆపకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామని అవసరమైతే పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న కాలనీవాసులు

ఎఫ్‌టీఎస్‌లకు జీతాలు చెల్లించాలి

కామారెడ్డిటౌన్,జనవరి 3: జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాలలో వ్యవసాయభూముల రిజిస్ట్రేషన్‌లకు ధరణిప్రోగ్రాం పరిధిలో నియమించబడిన ఎఫ్‌టీఎస్(ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్)లకు జీతాలు అందించాలని ఎఫ్‌టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం బుధవారం ఒక ప్రకటనలో కోరారు.గత 10 నెలలుగా జీతాలు అందక సిబ్బంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 2018లో ఎఫ్‌టీఎస్‌లుగా నియమించబడిన తమకు చాలీచాలని జీతాలు అందించడమే కాకుండా సమయానికి అందించడం లేదని తెలిపారు. ప్రస్తుతం కేవలం రూ.11583 జీతం మాత్రమే చెల్లిస్తున్నారని ఆ జీతం సైతం 10 నెలలుగా చెల్లించకపోవడం సిగ్గుచేటని అన్నారు.ధరణి కంప్యూటర్ ఆపరేటర్‌ల జీతాలు రూ.31040 పెంచాలని, మహిళలు కూడా విధులు నిర్వహిస్తున్నందున వారికి వేతనంతో పాటు ప్రసూతి సెలవులు ఇవ్వాలని,జీతాలు డీడీఓ ద్వారా గాని కలెక్టర్ ద్వారా గాని ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

తండాల్లో పోలీసుల కార్డాన్ సెర్చ్



పంట పొలాల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

గాంధారి,జనవరి 3:మండలంలోని చద్మల్‌తండా, నేరల్,బిర్మల్ తండాలలో బుధవారం ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సదాశివనగర్ సీఐ రామన్, జిల్లాలోని 14 మంది ఎస్ఐలు, 3గురు ఏఎస్ఐలు,ఐదుగురు హెడ్‌కానిస్టేబుల్‌లు, 37 మంది పోలీసు కానిస్టేబుల్‌లు, 9 మంది హోంగార్డులు తదితర కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో గంజాయి మొక్కల పెంపకం ఎక్కడైన ఉందా అని పరిశీలించారు. చద్మల్‌తండాలో ఒక గుర్తుతెలియని వ్యక్తి నుంచి 15 కిలోల ఇప్పపూవ్వ స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సాగుపై నిఘా ఉంచడంతో పాటు ప్రతిరోజు తనిఖీలు నిర్వహిస్తామని డీఎస్పీ తెలిపారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

దోమకొండ, జనవరి 3:ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన పథకాలకు ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని జడ్పీటీసీ తీగల తిర్మల్ గౌడ్, మండల ప్రత్యేకాధికారిణి భాగ్యలక్ష్మీ అన్నారు. బుధవారం మండలంలోని సంగమేశ్వర్ గ్రామంలో ప్రజాపాలన గ్రామ సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరు పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



సంగమేశ్వర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న మండల ప్రత్యేకాధికారిణి

‘పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం’


బీర్కూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, కాంగ్రెస్ నాయకులు


ప్రజలకు దరఖాస్తులు అందిస్తున్న ఆర్డీవో


దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ హిమబిందు

బీర్కూర్, జనవరి 3: పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం బీర్కూర్ మండలం వీరాపూర్, బీర్కూర్ తండా గ్రామాల్లో అభయహస్తం ప్రజా పాలన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ జనార్ధన్, ఎంపీడీవో భానుప్రకాష్‌లు కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల దగ్గరకు వెళ్లి పూర్తి వివరాలతో దరఖాస్తులు పూరించి ఇచ్చారు. అనంతరం అధికారులకు అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందన్నారు. ఆరు గ్యారెంటీల్లో రెండు ఇప్పటికే అమలు చేశారన్నారు. మిగిలిన గ్యారెంటీలను అందించేందుకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారని అన్నారు. త్వరలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, రైతు పెట్టుబడి సహాయం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, పక్కా ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ లాంటి పథకాలు అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జనా ర్ధన్, ఎంపీడీవో భానుప్రకాష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయిని శంకర్, సొసైటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు బస్వరాజు, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి ఎక్బాల్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతూరం కాశీరాం, సీనియర్ నాయకులు చందూ, సొసైటీ డైరెక్టర్ బో యిని గంగాధర్, కిసాన్ కేత అధ్యక్షులు పులేని పీరయ్య, బత్తిని గంగాధర్, నర్సింగ్‌రావు, రామారావు, బోయిని నారాయణ, సత్యం, అంబం గంగన్న, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాల్లో భాగంగా ఆరు గ్యారెంటీ పథకాల కొరకు అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవా లని అధికారులు, నాయకులు కోరారు. బుధవారం నసురుల్లాబాద్ మండలంలోని హాజీపూర్ గ్రామంలో ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆరు గ్యారెంటీ పథకాలలో భాగంగా సబ్సిడీ గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు తదితర సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ త్వరలో చేరుతాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందు పటేల్ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్,అధికారులు, గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీనాయకులు తూము సాయాగౌడ్, శివప్రసాద్, యూసుఫ్ పాల్గొన్నారు.

మాచారెడ్డి: ప్రజాపాలన కార్యక్రమాన్ని మండలంలోని భవానిపేట తండా గ్రామపంచాయతీలో బుధవారం ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కల్గకుండా దరఖాస్తులను స్వీకరించాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్ర మంలో ఎంపీడీఓబాలకృష్ణ, తహసీల్దార్ జయంత్‌రెడ్డి,సర్పంచ్,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సదాశివనగర్: ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరిస్తున్న దరఖాస్తులు 6వ తేదీ వరకు స్వీకరించబడుతాయని తహసీల్దార్ హిమబిందు తెలిపారు.మండలంలోని తిమ్మాజివాడిలో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించారు. ప్రజలకు సౌకర్యంగా ఉండటానికి గ్రామాలలో ఒక రోజు అధికారులు కార్యక్రమం ఏర్పాటుచేసి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతోందని తెలిపారు. మండలంలోని ఆయాగ్రామాల ప్రజలు సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 6వ తేదీ వరకు దరఖా స్తులు అందజేయవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలోఎంపీవో సురేందర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పోన్న స్వప్న, కడతాల రాజమణి, లత, మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట: మండలంలోని మూడు గ్రామాలలో బుధవారం అధికారులు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు.అభయహస్తం గ్యారెంటీ పథకాలకోసం మండలంలోని జలాల్‌పూర్, మాల్‌తుమ్మెద, వాడి గ్రామాలలో ప్రజాపాలన గ్రామసభలను ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అన్ని గ్రామాలలో మొదట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశంతో అధికారులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం అమలు చేయనున్న ఆరుగ్యారెంటీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీమనోహర్‌రెడ్డి, ఎంపీపీరాజ్‌దాస్,సర్పంచ్‌లు కృష్ణ, ప్రతిభ,అనూష, తహసీల్దార్ మహేందర్‌కుమార్, ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్, ఏవో విజయ్ శేఖర్, ఎంపీటీసీలు, వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భిక్కనూరు: ప్రభుత్వంప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గాల్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని కాచాపూర్, కంచర్ల, మల్లుపల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీమాట్లాడుతూ ప్రభుత్వం ప్రతీ ఒక్కరికి దరఖాస్తు ఫారాలను అందజేయడం జరుగుతోందని, జిరాక్స్ ఫారాలను ఎవరు కొనుగోలు చేయ్యవద్దన్నారు. ఐదు గ్యారెంటీలతో పాటుగా రేషన్‌కార్డు, భూసమస్యలకు ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు.ఈకార్యక్రమంలో ఎంపీడీవో అనంత్‌రావు, ఎంపీవో ప్రవీణ్ కుమార్, సర్పంచ్‌లుసులోచన,లలిత, చంద్రకళ, ఎంపీటీసీలు మోహన్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు బల్యాల సుదర్శన్, సిద్దాగౌడ్, శంకర్, సిదారెడ్డి,రాంరెడ్డి,తిరుపతి,మాధవరెడ్డి, ఆయాగ్రామపంచా యతీల పాలకవర్గం సభ్యులు, నాయకులు, ఆయాశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: జుక్కల్‌మండలంలో అధికారులు ప్రజాపాలన సభలో దరఖాస్తులు సక్రమంగా తీసుకోవాలని జిల్లా జడ్పీ సీఈవో సాయాగౌడ్ సూచించారు. బుధవారం మండలంలోని బిజ్జల్‌వాడీ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన సభను అకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో సాయాగౌడ్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కోసం దరఖాస్తులు చేస్తున్నారని అధికారులు దీనిని గమనించి వారి దరఖాస్తులు సక్రమంగా తీసుకుని రశీదు ఇవ్వాలని సూచించారు. అనంతరం ఈ సభలో గ్రామస్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని సీఈవో ప్రశ్నించగా రేషన్ కార్డులు కొత్తగా రావడం లేదని దీంతో ఇబ్బందులు ఎదురౌతున్నాయని ప్రజలు సీఈవోకు తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతోందని సీఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో గొలే యాదు, ఎంపీడీవో నరేష్, ఆర్ఐ రాంపటేల్, పంచాయతీ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

5వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం


ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న గురుకుల సిబ్బంది

పెద్దకొడప్‌గల్, జనవరి 3: పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో గల బాలికల గురుకుల పాఠశాలలో 5వతరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశపరీక్షకు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్ లో ఈ నెల 6వ తేదీ లోపు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూ చించారు. ప్రవేశ పరీక్ష 2 ఫిబ్రవరి 2024లో ఉంటుందని, దీనిని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని సూచించారు.ఈకార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ మీనాక్షి, సూపరింటెండెంట్ సతీష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

‘రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి’

బీర్కూర్, జనవరి 3: రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీడీఎం ప్రవీణ్ అన్నారు. బుధవారం బీర్కూర్ మండల కేంద్రంలోని ఏటిగడ్డ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఐదో సర్వసభ్యసమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా, వ్యాపారపరంగా ఎదిగేందుకు రాయితీపై విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అందించాలన్నారు. రైతులు తాము పండించిన ధాన్యానికి గిట్టు బాటు ధర వచ్చేంత వరకు ధాన్యాన్ని దాచుకోవాలన్నారు. ధాన్యందాచుకోవడానికి గిడ్డం గుల అవసరం ఉంటుందన్నారు. గిడ్డంగుల నిర్మాణం కోసం రైతులకు రాయితీపై రుణాలు మంజూరు చేస్తామని హామీఇచ్చారు. ఈకార్యక్రమంలో ఏటిగడ్డ రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు గంగాధర్, ఏఈవో శ్రావణ్‌కుమార్, డైరెక్టర్లు సభ్యులు పాల్గొన్నారు.


బీర్కూర్‌లో రైతు సమావేశంలో మాట్లాడుతున్న డీడీఎం ప్రవీణ్

సావిత్రీబాయి ఫూలే జయంతి

మద్నూర్, జనవరి 3: మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జన్మదిన వేడుకలను సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్నూరు కాపు సంఘం మండల నాయకులు గంగారాం సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. మహిళల చదువు కోసం ఎంతో కృషిచేశారని, ఆమె కృషి వల్ల మహిళలు ఉన్నత చదువులు చదువుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హన్మాండ్లు, చందర్, సాయిలు, రాములు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయాగ్రామాల్లో తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏబీవీపీ భిక్కనూరుశాఖ ఆధ్వర్యంలో, మండలంలోని ఆయా పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సావిత్రీబాయిపూలే చిత్రపటానికి ఉపాధ్యాయులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భిక్కనూరు ఏబీవీపీ ప్రతి నిధులు, ఆయాపాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామారెడ్డి: రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను బుధవారం ఎస్సీ,ఎస్టీ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించి ఆమె సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది వెంకటరాజు, అశోక్‌గౌడ్, నగేష్‌బాబు, తిరుపతి, రాజాగౌడ్, రమేష్, సిద్దయ్య, చైతన్య, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్: సంఘ సేవకురాలు, తొలి మహిళా ఉపా ధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను బుధ వారం బీర్కూర్ మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సావిత్రీబాయిపూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి మాట్లాడుతూ నేడుమహిళలు గొప్పస్థాయిలో ఉన్నత శిఖరాలు అధిరోహించగలుగుతు న్నారంటే దానికి కారణం విద్యనే అని అన్నారు.స్త్రీల విద్యాభివృద్ధి, వారి హ క్కుల కోసం పోరాడిన మొట్ట మొదటి మహిళా ఉద్యమకారిణి సావిత్రి బాయి పూలే అని గుర్తుచేశారు.ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


సావిత్రి బాయి పూలేకు నివాళులు అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పెద్దకొడప్‌గల్: రాష్ట్రంలో మహిళలు విద్యాభ్యాసం చేసేలా కృషి చేసిన ఘనత సావిత్రీబాయిపూలేదేనని జిల్లా ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి అజయ్ తెలిపారు. బుధవారం సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరిం చుకుని జుక్కల్ మండల కేంద్రంలో ఆమె చిత్ర పటానికి నివాళులు అర్పించారు. గతంలో మహిళలు విద్యాభ్యాసం చేయక అనేక ఇబ్బం దులను ఎదుర్కొంటుంటే సావిత్రీబాయిపూలే చేసిన కృషి వలన మహిళలు ప్రస్తుతం ఉన్నత విద్యలు చదువుతున్నారని తెలిపారు. సావిత్రీబాయిపూలే లేకుంటే మహిళలు ఉన్నత విద్య చదివేవారు కాదని, సావిత్రి బాయి పూలే లేని జీవితం తలుచుకుంటే భయం వేస్తోందని తెలిపారు. అనంతరం సావిత్రీబాయిపూలే జీవితం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నియోజక వర్గ అధ్యక్షుడు సాగర్, మండల అధ్యక్షుడు ఫిర్దోస్, కమిటీ సభ్యులు కృష్ణ మోహన్, పండు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప దీక్ష స్వామి మృతి

నిజాంసాగర్,జనవరి 3: నిజాంసాగర్ మండలంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప దీక్ష స్వామి ఒకరు మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం నిజాంసాగర్ మండల కేంద్రంలో చర్చి వద్ద ప్రధాన రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదం లో సంగారెడ్డి జిల్లా మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన అయ్యప్ప స్వామి యంబరి కాశయ్య (55) అక్కడికక్కడే మృతిచెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. మాసాన్‌పల్లికి చెందిన సాయిలు, బాల కిష్టయ్య, విఠల్, లింగం, యంబరి కాశయ్య ఐదుగురు అయ్యప్ప మాలధారణ చేశారు. వీరిలో సాయిలు ఆటో డ్రైవర్ ఈయన కూడా అయ్యప్ప మాలధారణ గురుస్వామి వీరంతా బుధవా రం మధ్యాహ్నం ఎల్లారెడ్డి మండలంలోని మల్కాపూర్‌లో పడిపూజ కార్యక్రమానికి వెళ్లారు. నిజాంసాగర్ మండల కేంద్రానికి చేరుకున్న వీరి ఆటో మాగి చక్కెర పరిశ్రమకు చెరుకు ఖాళీ చేసి కోటగిరి మండ లానికి ప్రయాణిస్తుండగా, ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటో బోల్తా పడగా,ఆటోలోప్రయాణిస్తున్న యంబరి కాశయ్య మృతి చెందగా,బాలకిష్టయ్య,విఠల్, లింగంలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డికి తరలించారు. డ్రైవర్ సాయిలు స్వామికి స్వల్ప గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ లారీని అక్కడే వదిలివెళ్లిపోయాడని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.


మృతిచెందిన యంబరి కాశయ్య

CLASSIFIEDS

WANTED

★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషంట్‌లను / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని, వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. ఫోన్: 8977639662, 8977639663 AJH-13253

Classifieds
మీ అభిమాన ఆంధ్రజ్యోతి దినపత్రిక కల్పిస్తోంది ఒక చక్కటి అవకాశం
ప్రతి రోజు... క్లాసిఫైడ్స్

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
కామారెడ్డి : 9985411453

‘అయోధ్య’ పూజిత అక్షింతల ఊరేగింపు

సదాశివనగర్,జనవరి 3:ఉత్తునూర్‌లో అయోధ్యరామయ్య పూజిత అక్షింతల ఊరేగింపు బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతీ గ్రామానికి అందించిన అక్షింతలను భక్తులు భక్తి శ్రద్ధలతో గ్రామంలోని వీధుల వెంట ఊరేగింపు నిర్వహించారు.ఈ నెల 15 వరకు స్వామివారి అక్షింతలను ఇంటింటికి పంపకం చేస్తామని 22న నిర్వహించే స్వా మివారి ప్రాణప్రతిష్ట సందర్భంగా ఇంటింటికి దీపాలు వెలిగించా లని తెలిపారు.ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు దోడ్లే రవి, శ్రీనివాస్, ఎంపీటీసీ రామచంద్రరావు,ఉపసర్పంచ్ శివపాటిల్, సొసైటీ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద: బిచ్కుంద సద్గురు బండయ్యప్ప స్వామి మఠాధిపతి సోమలింగ శివచార్యులకు అయోధ్యలో శ్రీరాముని విగ్రహప్రతి ష్ఠాపన కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానం అందింది. బిచ్కుంద నుంచి రామజన్మభూమి అయోధ్యకు మఠాధిపతులు హాజరుకా వాలని ఆహ్వానం రావడంపై మండలప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

ఉత్తమ వ్యాయామ టీచర్‌గా సంధ్య ఎంపిక

సదాశివనగర్,జనవరి 3: మండలంలోని ధర్మారావుపేట ఉన్నత పాఠశాలలో వ్యాయమ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సంధ్యకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు దక్కింది. సావిత్రిబాయి పూలే 193వ జయంతి సందర్భంగా రవీంద్రభారతీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌చేతుల మీదుగా బుధవారం అవార్డు అందుకుంది.

మైనార్టీ రెసిడెన్షియల్‌లో విద్యార్థికి అస్వస్థత

కామారెడ్డిటౌన్,జనవరి 3:కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మైనారీ రెసిడెన్షియల్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న ఫైజాన్ అనే విద్యార్థి బుధవారం పాఠశాలలో తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పాఠశాల సెక్యూరిటీ గార్డ్ శ్రీనివాస్ తన వాహనంపై అంబులెన్స్ లేకుండా కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి చికిత్సఅందేలా చూసి విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు.దీంతో ఫైజాన్‌తల్లి రైసాబేగం ఆసుపత్రికి చేరుకుని విద్యార్థి పరిస్థితి చూసి రెండురోజుల నుంచి అస్వస్థతకు గురైన సిబ్బంది కనీస సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల సిబ్బందిపై తగిన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ విషయమై ప్రిన్సిపల్ నారాయణగౌడ్‌ను వివరణ కోరగా విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఎలాంటి నిర్లక్ష్యం లేదన్నారు. ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు.ఫైజాన్ మధ్యాహ్నం వరకు బాగానే ఉన్నాడని పరీక్షలు కూడా రాసాడన్నారు. మధ్యాహ్నం వాంతులు కావడంతో ఆసుపత్రికి తీసుకురావడం జరిగిందని తెలిపారు.


అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న ఫైజాన్

కెనరా బ్యాంక్ / केनरा बैंक / Canara Bank — A Government of India Undertaking — Together We Can
కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీ
ఆంధ్రజ్యోతి ABN
అందమైన ముగ్గులు వేయండి... ఆనందంగా బహుమతులు అందుకోండి...
మొదటి బహుమతి రూ.6000/-
రెండో బహుమతి రూ.4000/-
మూడో బహుమతి రూ.3000/-
Radhika Groups — We Built Your Dreams...
కామారెడ్డి స్పాన్సర్ :
శ్రీవారి ఎకో టౌన్‌షిప్ — “ కామారెడ్డి జిల్లా కీర్తి కిరీటం లో మరో మైలురాయి ”
రాధిక కన్‌స్ట్రక్షన్
రాధిక మెస్
కామారెడ్డి
ముగ్గుల పోటీ జరుగు స్థలం : సరస్వతి శిశు మందిర్, కామారెడ్డి,
తేది: 07-01-2024 ఆదివారం, ఉ॥ 9-00 గం॥ల నుండి
సెల్ : 99854 11258, 9000228935
బాన్సువాడ స్పాన్సర్ :
మొదటి బహుమతి: అమృతాదిత్య చిట్‌ఫండ్ — శ్రీరామకాలనీ, బాన్సువాడ — బ్రాంచులు: బాన్సువాడ, బోధన్
ద్వితీయ బహుమతి: జాగృతి హాస్పిటల్స్ — ఆర్థోపెడిక్ & ఫిజిషియన్ — బస్టాండ్ ప్రక్కన, బాన్సువాడ
తృతీయ బహుమతి: వెంకటేశ్వర హాస్పిటల్స్ — ఫిజిషియన్ — బస్టాండ్ ఎదురుగా, బాన్సువాడ
ముగ్గుల పోటీ జరుగు స్థలం :- ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం, బాన్సువాడ
తేది: 07-01-2024 ఆదివారం, ఉ॥ 9-00 గం॥ల నుండి
సెల్ : 99854 11458, 8074292462
కెనరా గృహ ఋణం 8.40% — సంతోషాల వసంతం, మీ ముంగిట — ప్రాసెసింగ్ మరియు డాక్యుమెంటేషన్ ఛార్జీలు మాఫీ — కెనరా వాహన ఋణం 8.70%
www.canarabank.com — 1800 1030

Powered By
AIMS INSTITUTES, Peenya, Bangalore — PROGRAMMES OFFERED: MBA, MBA In France, PGDM, BBA, BBA (Aviation), BCOM, MCOM, MFA (Financial Analysis), DIPLOMA Swiss Professional Diplomas in Hospitality (Culinary / Food & Beverage / Rooms service), BCA, MCA, BHM, MSW, PUC (PCMB/PCMC/CEBA)
AIMS Institutes: 1st Cross, 1st Stage, Peenya, Bangalore — AIMS Admissions Centre +91 81500 01994 — www.theaims.ac.in/apply — admission@theaims.ac.in

Real Partner
SWARGASEEMA SUKETANA — DTCP APPROVED — TS RERA P014000006315
KONDURG @SHADNAGAR (HYDERABAD)
DTCP & RERA APPROVED PLOTS
Ph: 9849012500 — CALL US FOR FREE SITE VISIT